క్లుప్తంగా

వినతుల పరిష్కారానికి కృషి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహా అన్నదానం



రామలింగేశ్వరాలయంలో అన్నదానం చేస్తున్న కిరణ్, సత్యనారాయణ

సీతంపేట: కార్తీక మాసోత్సవాల ముగింపు సందర్భంగా శంకరమఠం రోడ్డులోని రామలింగేశ్వరాలయంలో మంగళవారం మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించారు. సుమారు 4 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో రామలింగేశ్వరాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బొడ్డేటి కిరణ్‌కుమార్, పోతు సత్యనారాయణ, కాళ్ల సూర్యప్రకాష్, బొడ్డేటి రవి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పంచముఖ హనుమాన్‌గా యోగసిద్ధాంజనేయుడు



మురళీనగర్: జాతీయ రహదారి సూర్యనగర్-2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం ఆఖరి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు స్వామికి సింధూర అర్చన చేసి పంచ ముఖ ఆంజనేయస్వామిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.సుబ్బరాజు, ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా నూతన కార్యవర్గం



సురేష్‌కుమార్‌కు నియామక పత్రం అందిస్తున్న కాశీవిశ్వనాథరాజు

మురళీనగర్: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా(బీజేవైఎం) విశాఖ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ధోని నాగరాజు అధ్యక్షతన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు సమక్షంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కొత్త కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎస్.ఆర్.కె.రాజు, మీడియా సెల్ ఇన్‌చార్జిగా బలగ సురేష్‌కుమార్, జిల్లా కార్యదర్శిగా ప్రతాప్ రాజా తదితరులకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కాశీవిశ్వనాథరాజు నియామక పత్రాలను అందజేశారు. పదాధికారులకు ఎంపీ జీవీఎల్ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మేడపాటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయానందరెడ్డి, యువమోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు ఉప్పిలి వంశీ, యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.దిలీప్ నాయుడు పాల్గొన్నారు.

గెడ్డలకు మోక్షం



ఇది కదా అభివృద్ధి

ప్రమాదకరంగా మారిన గెడ్డలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి, మరమ్మతులకు నోచుకోకుండా అవి ఉండిపోయాయి. ఈ సమస్యపై దృష్టి సారించిన ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ప్రతి గెడ్డను ఆధునికీకరిస్తోంది.

అధ్వాన స్థితి నుంచి ఆధునికీకరణ

జీవీఎంసీ నిధులతో అభివృద్ధి

హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



నాడు: ప్రమాదకర స్థితిలో రైల్వే న్యూకాలనీ జంక్షన్ వద్ద గెడ్డ



నేడు: సింహగిరి లాడ్జి పక్కన ఆధునికీకరించిన గెడ్డ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులోని పలు గెడ్డలు అభివృద్ధికి నోచుకున్నాయి. రైల్వే న్యూకాలనీ జంక్షన్ సింహగిరి లాడ్జి పక్కన గల గెడ్డను జీవీఎంసీ నిధులు రూ.48 లక్షలతో ఆధునికీకరించారు. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ గెడ్డ శిథిలమై ప్రమాదకర స్థితికి చేరుకుంది. ఆయా సమయాల్లో కురిసిన వర్షాలకు గెడ్డ పైభాగం క్రమేపి కుచించుకుపోయింది. దీంతో గెడ్డపై వేసిన వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఈ కల్వర్టుపై నిర్మించిన ఫుట్‌పాత్‌లు ప్రమాదకరంగా మారాయి. వాటి మీద నుంచి నడిచేటపుడు ఏ మాత్రం ఆదమరిచినా.. కింద గెడ్డలో పడాల్సిందే. ఇది ఒకప్పటి పరిస్థితి. నేడు ఈ గెడ్డను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రమాదకర పరిస్థితి నుంచి బయటపడటంతో ప్రజలు దీనిపై సాఫీగా రాకపోకలు సాగిస్తున్నారు. జీవీఎంసీ నూతన కౌన్సిల్ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా వార్డుల అభివృద్ధికి కేటాయించిన రూ.1.50 కోట్ల నిధుల్లో భాగంగా కార్పొరేటర్ ఆళ్ల లీలావతి చొరవతో ఈ పనులను పూర్తి చేయించారు. సుమారు రూ.48 లక్షలతో ఈ గెడ్డకు సంబంధించిన ఇరువైపులా రిటైనింగ్ వాల్స్, బాటం కాంక్రీట్ పనులు పూర్తిచేశారు. ఈ గెడ్డను సుమారు 60 మీటర్ల మేర అభివృద్ధి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు: అధ్వానంగా నాగన్న గెడ్డ



నేడు: నాగన్న గెడ్డ వద్ద నిర్మించిన రక్షణ గోడలు

రూపురేఖలు మారిన నాగన్న గెడ్డ

42వ వార్డులోని పలు ప్రాంతాల మీదుగా ప్రవహిస్తున్న నాగన్న గెడ్డ ప్రమాదకర స్థితి నుంచి అభివృద్ధికి నోచుకుంది. ఒక పక్క గెడ్డలో పూడికలు, పెద్ద పెద్ద చెట్లు మొలిచి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. మరో వైపు కనకారావు వీధి, హరగోపాల్ స్కూల్ ఎదురుగా గల ప్రాంతంలో గెడ్డ రక్షణ గోడ కూలి గెడ్డలో ప్రవహిస్తున్న మురుగునీరు ఇళ్లలోకి ప్రవహించేది. ఇక వర్షాలు పడితే పరిస్థితి వర్ణనాతీతం. ఇళ్లన్నీ గెడ్డ నీటిలోనే మునిగిపోయేవి. 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి. ఎంతమందికి విన్నవించుకున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. గత జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీచేసి, గెలుపొందిన ఆళ్ల లీలావతి శ్రీనివాస్‌కు స్థానికులు సమస్యను తెలియజేశారు. వెంటనే ఆమె నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, నాటి జీవీఎంసీ కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రాధాన్యత క్రమంలో ఈ గెడ్డ ఆధునికీకరణ పనులను చేపట్టారు. సుమారు రూ.39 లక్షల జీవీఎంసీ నిధులు వెచ్చించారు. గెడ్డ సమస్య పరిష్కారమవడంతో ఆయా ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవీఎంసీ వార్డు నంబర్: 42

రైల్వే న్యూకాలనీ గెడ్డ అభివృద్ధికి చేసిన ఖర్చు : రూ.48 లక్షలు

పనులు/నిర్మాణాలు : రిటైనింగ్ వాల్స్, బాటం కాంక్రీట్

నాగన్న గెడ్డ ఆధునికీకరణకు చేసిన ఖర్చు : రూ.39 లక్షలు

పనులు/నిర్మాణాలు : రిటైనింగ్ వాల్స్, బాటం కాంక్రీట్

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి



ఈ వార్డులోని రైల్వే న్యూకాలనీ సింహగిరి లాడ్జి పక్కన గల గెడ్డ, నాగన్న గెడ్డ దారుణంగా ఉండేవి. ప్రాధాన్యత క్రమంలో ఈ పనులను పూర్తిచేయించారు. రైల్వే న్యూకాలనీ జంక్షన్ గతంలో కంటే ఎంతో సుందరంగా మారింది. నాగన్న గెడ్డకు ఇరువైపులా రక్షణ గోడలు, బాటం కాంక్రీట్ వేయించి అభివృద్ధి చేశారు. – ఆళ్ల శ్రీనివాసరావు, తాటిచెట్లపాలెం

తొలగిన ఇబ్బందులు



కొన్నేళ్లుగా సింహగిరి లాడ్జి పక్కన ఉన్న గెడ్డతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నేడు ఈ జంక్షన్ చూడడానికి ఎంతో అందంగా తయారైంది. ఎంతటి వర్షాలైనా గెడ్డ నుంచి నీరు సులువుగా ప్రవహిస్తుంది. కార్పొరేటర్ చొరవతో ఈ పనులు పూర్తిచేయడం సంతోషంగా ఉంది. – దాడి శ్రీనివాసరావు, రైల్వే న్యూకాలనీ

గెడ్డలు బాగున్నాయి



గతంలో వర్షాలు కురిస్తే రైల్వే న్యూకాలనీ గెడ్డ పరిసర ప్రాంతాలు మునిగిపోయేవి. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజాప్రతినిధుల కృషి, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి చొరవతో ఈ గెడ్డను, రైల్వే న్యూకాలనీ జంక్షన్‌ను అభివృద్ధి పరిచారు. ప్రస్తుతం ఈ గెడ్డ పరిస్థితి చాలా బాగుంది. – సురేష్, రైల్వేన్యూకాలనీ

అభివృద్ధి, ప్రత్యేక కార్యక్రమాలపై సమీక్ష



కార్పొరేటర్లు, నాయకులతో సమీక్షిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలు, రహదారి విస్తరణ పనులు, కమ్యూనిటీ హాల్స్, కొండవాలు ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, మెట్లు, డ్రైనేజీల పనులపై చర్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు, ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిపై చర్చించామన్నారు. సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాసరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, కార్పొరేటర్లు కటారి అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, రెయ్యి వెంకటరమణ, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, కె.వి.ఎన్.శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు నీలి రవి, పైడి రమణ, షేక్ జుబేర్, కె.పి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాసరావు, జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, డైరెక్టర్లు పైడి శ్రీను, పాండవ శ్రీను, మధు, చిరంజీవి, బలిరెడ్డి గోవింద్, సానబోయిన సురేష్, కర్రి రామారెడ్డి, జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో పోలి పాడ్యమికి ఏర్పాట్లు



పార్వతీశ్వరాలయంలో దీపాలు జారవిడిచేందుకు ఏర్పాటు చేసిన కృత్రిమ కొలను

సీతంపేట: శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం మంగళవారం అమావాస్యతో ముగిసింది. నెల రోజుల పాటు భూలోకంలో విహరించిన శంభోశంకరుడికి కార్తీక దీపాలతో వీడ్కోలు పలికేందుకు భక్తులు సిద్ధమయ్యారు. బుధవారం పోలి పాడ్యమి పర్వదినాన్ని పురస్కరించుకుని సూర్యోదయానికి ముందు నీటిలో దీపాలు వదిలి పార్వతీ పతిని కైలాసానికి సాగనంపుతారు. దీని కోసం దేవదాయ శాఖ పరిధిలోని శివాలయాల్లో భక్తులు దీపాలను వదలడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్ రామలింగేశ్వరాలయంలో కృత్రిమ కొలనులు నిర్మించారు. ఒకేసారి 30 మంది భక్తులు దీపాలు నీటిలో వదిలే ఏర్పాటు చేశారు. బుధవారం వేకువజాము మూడు గంటల నుంచి దీపాలు వదిలేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ, నాగ కామేశ్వరశర్మ తెలిపారు.

మురళీనగర్ రామాలయంలో..

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో పోలి పాడ్యమి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యదర్శి సనపల వరప్రసాద్ చెప్పారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా కొలను ఏర్పాటు చేశారు. బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ కొలనులో కార్తీక దీపాలు వదలడానికి వీలుగా ఈ కొలను ఏర్పాటు చేశారు. మహిళలు, ఇతర భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

‘ఆడుదాం ఆంధ్రా’ బైక్ ర్యాలీ నేడు



బైక్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆళ్ల శివగణేష్

సీతమ్మధార: ఈ నెల 13న చేపట్టే ఆడుదాం ఆంధ్రా బైక్ ర్యాలీలో విశాఖ యువత పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని ఒక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ర్యాలీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 8.30 గంటలకు ఎన్‌ఏడీ జంక్షన్ నుంచి జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, అంతర్జాతీయ క్రికెట్ ఆటగాడు అంబటి రాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ పశ్చిమ, ఉత్తర సమన్వయకర్తలు, ఆడారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

- వైఎస్సార్‌సీపీ ‘ఉత్తర’ సమన్వయకర్త కె.కె.రాజు
- 49, 47, 45, 53 వార్డుల్లో ‘వై ఏపీ నీడ్స్ జగన్’



49వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

మురళీనగర్: రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో వార్డులోని 1086284 సచివాలయం పరిధి మురళీనగర్, సింగరాయిమెట్ట కాలనీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే మళ్లీ ఆయనే రావాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలుపరిచిన ఏకైక నాయకుడిగా వైఎస్ జగన్ రికార్డు సృష్టించారని చెప్పారు.



45వ వార్డులో పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు

స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో 47వ వార్డు 1086270 సచివాలయం పరిధి న్యూ బాపూజీ నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. కె.కె.రాజు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేసి సీఎం జగన్ పాలనను వివరించారు. ఈ సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల సైన్‌బోర్డు, వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, కార్పొరేషన్ల డైరెక్టర్లు యఎరవికుమార్, ఐ.రవికుమార్, జేసీఎస్ మండల కన్వీనర్లు నీలి రవి, 49, 47 వార్డుల నాయకులు గురువోజీ, ఢిల్లీరావు, బి.సరస్వతి, ఎస్.చంద్రశేఖర్, కమలకుమారి, సౌజన్య, రమేష్, సుబ్బలక్ష్మి, చైతన్య, ఎస్కే మస్తాన్, శ్యామల, రామారెడ్డి, ఆచారి, ఎస్.శ్రీను, చంద్రమౌళి, శంకర్, సీహెచ్ శ్రీను, మున్నా, కె.అప్పలనాయుడు, భరత్, జగది, పద్మ, సతీష్, పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను గెలిపించుకుందాం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు 252 సచివాలయ పరిధిలో కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు.



53వ వార్డులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న గుజ్జు వెంకటరెడ్డి, పైడి కృష్ణారావు తదితరులు

సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం లబ్ధిదారులతో కార్పొరేటర్ మాట్లాడుతూ సంక్షేమ పాలన కావాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని కోరారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, నాయుడు, సత్యానందం రెడ్డి, సచివాలయ సిబ్బంది, సీవో, ఆర్పీలు, కన్వీనర్లు, గృహసారథులు, బూత్ ఇన్‌చార్జిలు, మహిళలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌తోనే సుపరిపాలన

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని అటవీ శాఖ డైరెక్టర్ గుజ్జు వెంకటరెడ్డి అన్నారు. 53వ వార్డు మసీద్ స్ట్రీట్, శివనగర్–2 వద్ద ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. 297–298 సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టారు, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, పార్టీ నాయకులు షేక్ బాబ్జి, జ్ఞానేష్, సుశీల, అలీ, హనుమంతు, జయ, జ్యోత్స్న, సంపత్, కృష్ణ, భాస్కర్, పైడిరాజు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

దిగ్విజయంగా అన్నప్రసాద వితరణ



రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణలో పాల్గొన్న మాలధారులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయి బాబా ధ్యాన మందిరంలో మాలధారులకు ప్రారంభించిన ప్రత్యేక అన్నదాన కార్యక్రమానికి 30 రోజులు పూర్తయ్యాయని మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా స్వాములకు అనుకూల రీతిలో అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు చెప్పారు. 2021లో ఈ ప్రత్యేక కార్యక్రమం ప్రవేశపెట్టి సుమారు 63 రోజులు, 2022లో 74 రోజులు మాలధారులకు అన్నదానం చేశామన్నారు. బాబా భక్తులు, దాతల సహకారంతో ధ్యాన మందిర ప్రాంగణంలో ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు, గురువారాల్లో మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. నగరం నలుమూలల నుంచి అయ్యప్ప, సాయి, భవాని, శివ, కనకమహాలక్ష్మి అమ్మవారికి మాలలు ధరించిన ఎవరైనా అన్నప్రసాద వితరణలో పాలుపంచుకోవచ్చని శేషగిరిరావు కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు పరిధిలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు తులసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్న తరుణంలో అంగన్‌వాడీ కార్యకర్తలుగా విధులు నిర్వహిస్తున్న మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు కనీస వేతనాలు చెల్లించాలని కోరారు. గ్రాట్యుటీని అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రూ.5 లక్షలకు పెంచాలని ఇలా పలు డిమాండ్లు చేశారు. అనంతరం ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న ఫోర్త్ టౌన్ పోలీసులు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న వ్యక్తులపై పోలీసులు నిఘా పెట్టారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి ఈస్ట్ ఏసీపీ, డీఎస్ ఆర్‌వీఎస్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో సీఐ విజయకుమార్ తోపాటు ఎస్‌ఐలు రైల్వే స్టేషన్, బస్‌స్టాప్, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి స్టేషన్ రోడ్డులో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి ఒక్క బ్యాగును డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీలు జరిపారు. కేరళ, ముంబాయి, ఢిల్లీ ఇతర రాష్ట్రాల నుంచి ఒడిశాతో పాటు ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో ఈ చర్యలు చేపట్టారు. ఎస్‌ఐ ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.